# పిచ్చి తల్లి

"డ్రైవర్! కారాపు." కలెక్టర్ గిరి చెప్పాడు.

ఒక్క కుదుపుతో కారాగింది.

గిరి ఎదురుగా ఉన్న చెట్టుకేసి చూస్తున్నాడు.

"న్యాయం కావాలి! - జీవన భృతి కావాలి - నలుగురు పిల్లల తల్లికి భద్రత కావాలి!" ఇలా రకరకాల ప్లే కార్డ్సు కనిపించాయి.

వాటి మధ్యలో ఓ పిచ్చి తల్లి.

చింపిరి జుట్టు - మాసిన చీర - పీక్కుపోయిన బుగ్గలు - గుంటలు పడ్డ కళ్ళు - పేదరికానికి రూపం వచ్చి ఆ చెట్టు కింద కూర్చున్నట్లుంది.

"సార్! ఎవరో పిచ్చిది! మీకు అపాయింట్‌మెంట్ ఉంది. పోదాం పదండి." పి.ఏ. సింహం గుర్తు చేశాడు.

"నో! ఆమెని నా దగ్గరికి పిలవండి. మాట్లాడుదాం." ఆర్డరు జారీ చేశాడు గిరి.

ఆ మేరకు సింహం దిగి వెళ్ళి ఆమెతో ఏదో మాట్లాడాడు. ఆమె తల ఊపింది అడ్డంగా.

"సార్! ఆమె రాదుట సార్! ఆమె డిమాండ్లు నెరవేరేదాకా ఆ చెట్టు కింద నుంచి కదలదుట." సింహం చెప్పాడు గిరికి.

"ఐసీ! ఏంటిట ఆమె డిమాండ్లు?" ఎంక్వయిరీ చేశాడు.

"ఆమె కొడుకుల నుండి జీవనభృతి కావాలిట. ఆమెకు నలుగురు కొడుకులున్నారట! కాని ఆమెకు తిండానికి తిండిలేదుట. కనీసం ఒక్కొక్కరు రెండు వందల రూపాయలు యివ్వాలని ఆమె డిమాండ్ చేస్తున్నది సార్!" సింహం వివరించాడు.

"సో! అది ఒక కుటుంబ సమస్య అన్నమాట! ఒకే లెటజ్ గో!" చెప్పాడు గిరి.

కారు దుమ్ము లేపుకుంటూ వెళ్ళిపోయింది.

సీట్లో కూర్చుని కాగితాల మీద సంతకం పెడుతున్నాడన్నమాటేగాని అతని మనోఫలకంలో ఆ పిచ్చితల్లి రూపం కదలాడుతున్నది.

"సార్! మీకు ఉత్తరం." పి. ఏ. తెచ్చిచ్చాడు.

గిరి ఆత్రంగా అందుకున్నాడు. ఇంటి నుంచి. గబగబా చింపి చదవడం మొదలెట్టాడు.

"బాబూ గిరీ! నీ తల్లి ఆశీర్వదించి వ్రాయునది. చాలా పెద్దవాడివైపోయావు. బాబు! నీ జీవితాశయం నెరవేరింది. ఒక జిల్లాకు కలెక్టర్‌వయ్యావు. మన ఊళ్ళో అందరూ నీ గురించి గొప్పగా చెప్పకుంటున్నారు.

కాని - మాకే - దిగులుగా ఉంటున్నది.

మీ నాన్నగార్కే పరాకు జాస్తి అయింది. టి.వీ.లో ఏ కుర్రాడు కనిపించినా 'మన గిరిలాగున్నాడు కదూ' అంటారు. రోజు ఊరికొచ్చే పేపర్లన్నీ కొనుక్కొస్తున్నారు. ఎక్కడైనా నీ గురించి న్యూస్ పడిందేమోనని చూస్తున్నారు. న్యూస్ కనిపించగానే దాన్ని కట్‌చేసి భద్రం చేస్తున్నారు. మాకున్న ఏకైక నలుసువు - ఇంతంత దూరాలు పోతావని తెలిస్తే యింత పెద్ద చదువులు చెప్పించేదాన్ని కాదు.

నీ ఆరోగ్యం జాగ్రత్త! కోడలు పిల్లని-మనవడ్ని అడిగినట్లు తెలుపు- మీ అమ్మ."

గిరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

నాన్నగారు తన్ను ఎప్పుడూ కలెక్టర్ కావాలని కోరుతూ ఉండేవారు.. కాని.. అది సాధించింతర్వాత.... తన వాళ్ళకు దూరమై నాలుగేళ్ళయింది.

కన్న ఊరు -

కన్న తల్లి -

మమకారాలకు దూరమై ఎంతో ఎత్తుకు ఎదిగాడు.నా ఇల్లు - నా వాళ్ళు అని ముక్కు మూసుకుని కూర్చుంటే ఈనాడు ఊరు ఊరంతా తన గురించి గర్వంగా చెప్పకునే అవకాశం ఉండేది కాదు.

"ట్రింగ్ - ట్రింగ్ - ట్రింగ్" ఫోన్ రింగయింది.

విసుగ్గా రిసీవర్ అందుకున్నాడు.

"సార్! మీ ఇంటి నుండి ఫోన్ - కనెక్షన్ యిమ్మంటారా - పెండింగ్ పెట్టనా?" ఆపరేటర్ కాజువల్‌గా అడుగుతున్నాడు.

వీడో గొప్ప మెటీరియలిస్టు.

జనరల్ ఇన్‌స్ట్రక్షన్స్‌ను స్పెషల్ కేసులకు కూడ అప్లై చేస్తాడు.

"ఊ! తొందరగా ఇవ్వు." కసిరాడు గిరి.

భార్యామణి హిమబిందు లైన్లోకి వచ్చింది.

"ఏవండీ! బాబుకు బాగోలేదండి.. మీరు అర్జెంటుగా రావాలి!" కంగారుగా చెప్పింది.

"ఏమైంది... ఉదయం బాగానే ఉన్నాడు కదా? స్కూలుకు కూడ పోయాడుగా!?" ఆశ్చర్యంగా, ఆందోళనగా అడిగాడు గిరి.

"కడుపు నెప్పితో ఉంగలు చుట్టుకుపోతున్నాడు. స్కూలువాళ్ళు డాక్టర్ దగ్గర ట్రీట్‌మెంట్ యిప్పించే పంపించారు. కాని తగ్గలేదు. నేను కూడ నాకుతోచిన మందులిచ్చాను. నాకు భయంగా ఉంది." ఎంతో కంగారుగా చెబుతున్నది హిమబిందు.

"ఒట్టి పిరికిగొడ్డు - ప్రతి చిన్నదానికి కంగారుపడుతుంది.. కడుపు నొప్పిదేముంది? ఆఫ్టరాల్!" విసుక్కున్నాడు గిరి. కాని బాబు ముద్దుమొహం గుర్తుకొచ్చింది. వాడు గిలగిలా కొట్టుకోవడం ఊహించుకుని చెలించిపోయాడు.

"బిందూ! డాక్టర్‌కు ఫోన్ చెయ్యి.. నేనుకూడ ఓ గంటలో వస్తాను. నీకు సాయంగా మా పి.ఏ.ను పంపిస్తాను ఈలోపు." ఫోన్ పెట్టేస్తూ చెప్పాడు.

నిజానికి గిరికి వెంటనే వెళ్ళిపోవాలనుంది. కాని ఓ అర్జెంటు మీటింగ్ కండక్ట్ చేయాలి. పెద్ద పెద్ద అధికారులు కాన్‌ఫరెన్సు హాలులో తనకోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే గంటకు పైగా కూర్చోపెట్టాడు. ఇప్పుడుపోస్టుపోన్‌చేసినా, క్యాన్సిల్ చేసినా బాగోదు.

చందు చాలా బొద్దుగా ఉంటాడు. ముద్దులు మూట కట్టేట్లు మాట్లాడతాడు. చందమామ భువినుండి దివికి దిగివచ్చినట్లు ఉంటాడు.

ఏకైక సంతానం కావడంతో చాలా ప్రేమగా చూసుకుంటాడు.

డాక్టర్లు అప్పడే ఇంకో సంతానంకు పోవద్దని సలహా యిచ్చారు - హిమబిందు ఆరోగ్యం అంతగా బాగోలేకపోవడంతో.

అందుకనే చందు ఆడింది ఆట పాడింది పాట. కేంపుకు పోయినా తిరిగి రాగానే వాడ్ని చూడంది - మాట్లాడంది ఉండలేడు. రాత్రి పూట ఉండి పోవాల్సిన పరిస్థితి వస్తే కనీసం ఫోన్‌లో అన్నా మాట్లాడతాడు.

అన్యమనస్కంగా కాన్ఫరెన్సు ప్రారంభించి.... ఏదో నాలుగు మాటలు చెప్పాడు.

ప్రొసీడింగ్సు నడుస్తున్నాయి కాని అతని మనసు మనసులో లేదు. ఎప్పుడు లేచిపోదామాని చూస్తున్నాడు.

"సార్! మీకు మెసేజ్!" ప్యూన్ ఓ కాగితం అందించాడు.

"చందును హాస్పిటల్‌లో చేర్చాం - ఆపరేషన్ చేయాలి.... పి.ఏ."

గిరికి మతిపోయింది. కళ్ళు తిరిగినంత పనైంది.

అపాలజీ చెప్పి కాన్ఫరెన్సులోంచి బయటపడ్డాడు.

గిరి నేరుగా జనరల్ హాస్పిటల్ చేరుకున్నాడు. అప్పటికే ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకుపోయారు చందును. హిమబిందు వెక్కిళ్ళు పెడుతూ బయట కుర్చీలో కూర్చునుంది.

"బిందూ! ఏం జరిగింది?"

"అపెండిసైటిస్‌టండి! ఎమర్జెన్సీ ఆపరేషన్ చెయ్యాలిట..." హిమబిందూ అంతా వివరించింది.

గిరికి నీరసం ఆవహించింది.

ఇంత చిన్న వయసులో ఆపరేషనా?

వాడికేమన్నా అయితే తానేం కావాలి? బిందు ఏం కావాలి? ఓ గాడ్! ఏం శిక్ష విధించావయ్యా.

"సార్! కంగారు పడొద్దు. మైనర్ ఆపరేషనేనట! టౌన్‌లో ఉన్న బెస్టు సర్జన్లు అటెండ్ అవుతున్నారు" పి.ఏ. వచ్చి ఓదార్చాడు.

"అంతేనంటావా? అసలు ఇంతదాకా రానీకుండా ఉండాల్సిందయ్యా! కలెక్టర్ బాబుకే పరిస్థితి యిలా వస్తే సామాన్య మానవుల బిడ్డలేం కావాలి? నా కంటే కెపాసిటీ ఉంది కాబట్టి అర్జెంటు మెడికల్ ఎయిడ్ దొరికింది. అదే గ్రామాల్లో ఉన్నవారిగతేంటి? డాక్టర్లు దొరకని వారి సంగతేంటి! అస్సలు డాక్టర్లు ఇంతదాకా రాకుండా వైద్యం చేయాలయ్యా!" గిరి అన్నాడు కేవలం తండ్రిలాగా తన గురించి మర్చిపోయి.

"సార్! మీకు ట్రంకాల్ . . . మీ పేరెంట్సునుండి." ఓ ప్యూన్ వచ్చి చెప్పాడు.

గిరి కంగారుగా పరుగెత్తుకుంటూ వెళ్ళాడు.

"హలో గిరిని మాట్లాడుతున్నా - ఎవరు మాట్లాడేది."

"నేనేరా మీ అమ్మను - నాన్నకు ఒంట్లో బాగోలేదు - స్పృహ తప్పి పడిపోయారు. హాస్పిటల్లో చేర్పించాను. నాకు భయంగా ఉంది." ఆమె కంగారుగా చెప్పింది.

"ఏం కాదులే అమ్మా! బి.పీ. పెరిగి కళ్ళు తిరిగి ఉంటాయి. నువ్వేం కంగారు పడమాకు - డాక్టరున్నారుగా చూసుకుంటారులే." తాపీగా చెప్పాడు.

"ఏంటీ చందుకేమైంది.. నాకు చాలా కంగారుగా ఉంది. బయలుదేరి వద్దామంటే మీ నాన్నకు ఇలా ఉంది." అవతలి నుండి తల్లి చాలా ఆదుర్దాగా అడుగుతున్నది.

"అవునమ్మా కాస్తుంటే సీరియస్ అయ్యేది - దేవుడు దయవలన తొందరగా కనుక్కొని ఆపరేషన్ చేస్తున్నారు.. ఆ ! నాన్నకేం కాదు. నువ్వేంకంగారుపడమాకు..." చెప్పాడు గిరి.

"రేపు ఫోన్ చెయ్యి బాబుకెలాగుందో.... తగ్గింతర్వాత మీ నాన్నగార్ని చూడ్డానికి రా! బాబును తీసుకుని"

"అమ్మా! నాకు ఇవతల చచ్చేటన్ని పన్లు. క్షణం తీరిక లేదు..... రాలేను....నువ్వే ఫోన్ చెయ్యి" విసుగ్గా చెప్పాడు.

"సరేలేరా! మేమే వస్తాం చూడ్డానికి-ఉంటా...బాబు జాగ్రత్త! నీ ఆరోగ్యం జాగ్రత్త!" ప్రేమకురిపిస్తూ చెప్పింది.

"ఏమైంది?" గిరిని అడిగింది బిందు.

"ముసలి చాదస్తం! నాన్నకు ఎప్పుడు ఏదో ఒకటి వస్తూ ఉంటుంది- అమ్మా కంగారు పడుతూ ఉంటుంది. ఎప్పుడూ రమ్మంటుంది! ఎలా కుదురుతుంది?" విసుక్కున్నాడు.

స్ట్రెచర్‌లో బాబును బయటికి తీసుకొచ్చారు- నిద్రపోతున్నట్లున్నాడు.

"డోంట్ వర్రీ సార్! హి ఈజ్ ఓకే!" పెద్ద డాక్టరు చెప్పాడు గిరికి.

అప్పటికి గిరికి ఉత్సాహం వచ్చింది.

ఓ గంట తర్వాత ఆఫీసుకు పోయొస్తానని చెప్పి బయటకు వచ్చాడు గిరి.

ఎదురుగా ఎవరినో స్ట్రెచర్‌లో పడుకోబెట్టి లోపలికి తెస్తున్నారు.

ఓ ముసల్ది! ఆమెని వెన్నంటి ఓ స్త్రీల గుంపు! వాళ్ళ చేతుల్లో అట్టలు- ఆ అట్టల మీద స్లోగన్స్!

"కలెక్టర్ గారొస్తున్నారు-తప్పుకోండి!" ప్యూన్‌లు వాళ్ళని కసిరారు.

"మాకు న్యాయం కావాలి!" కొన్ని కంఠాలు అరిచాయి.

"పి.ఏ. !ఈమెని ఎక్కడో చూసినట్లుంది?" విసుగ్గా అన్నాడు గిరి.

"అః!పొద్దున్న తమరు కారు ఆపి చూశారు."

"ఓః! పిచ్చితల్లి...హారే -ఆమెకేమైంది?" ఒక అట్ట ముక్క పట్టుకున్న ఒక యువతిని అడిగాడు.

"సార్! మీరే న్యాయం చెప్పండి సార్! సీతమ్మకు నలుగురు కొడుకులు. నలుగురూ ఒక్కొక్కొళ్ళు నాలుగువేలు పైన సంపాదిస్తున్నారు. కాని నలుగురూ కలిసి ఆమెకు కనీసం నాలుగు వందలు యివ్వలేరు. నాలుగు వందలన్నలేంది ఒక మనిషి ఈ కాలం ఒంటరిగా ఎలా బ్రతుకుతుంది సార్! నేను మహిళా మండలి సెక్రటరీ సంధ్యని." చెప్పింది సంధ్య.

"ముందు ఆమెకేమైంది. ఎందుకు హాస్పిటల్‌కు తీసుకు వస్తున్నారు." అయోమయంగా అడిగాడు.

"నిరసన వ్రతం సార్! ప్రొద్దుటి నుండి ఏమీ తీసుకోలేదు. తన కొడుకులు తన కోర్కెలు ఆమోదించేదాకా తను ఏమీ తీసుకోదుట. పెద్ద వయసు కదా స్పృహ తప్పి పడిపోయింది." సంధ్య చెప్పింది.

గిరి హాస్పిటల్ డాక్టర్ని పిల్చి ఆమెని జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు.

మరునాడు కలెక్టర్ ఛాంబర్‌లోకి ప్రవేశపెట్టబడ్డారు నలుగురు కొడుకులు సాయంత్రానికి.

"ఏమోయ్! మీకు సిగ్గుగా లేదు. ఒకే ఊళ్ళో ఉంటూ కన్న తల్లిని పట్టించుకోకుండా - యింట్లోంచి తరిమేసి - పెళ్ళాంతో కులకటానికి సిగ్గుగా లేదు." కేకలు వేశాడు గిరి.

"సారీ సార్! మేమెప్పుడు తరిమెయ్యలేదు. మా వాళ్ళతో పడక వేరే వెళ్ళిపోయింది." పెద్దవాడు ధైర్యం చేసి చెప్పాడు. అలా వరుసగా అందరూ తల్లిని దూషించారు ఎవరితో అడ్జెస్టు కాలేదని. అంతా ఆమెదే తప్పని.

గిరికి తల తిరిగిపోయింది.

"అనురాగం - ఆప్యాయత తల్లికి అందిచాల్సిన బాధ్యత కొడుకులది. మన సమాజంలో వయోవృద్ధులు బీదవారైతే ఆర్థికంగా కూడ ఆధాపడతారు బిడ్డలపైన. జన్మనిచ్చినందుకు కనీసం ఆర్థికంగా ఆదుకోవడం మీ కనీస ధర్మమయ్యా! కోడళ్ళు వచ్చింతర్వాత ఎలాగూ అనురాగం - అభిమానం - ఆప్యాయత పంచలేదు. కనీసం తిండి అన్నా పెట్టి ఆదుకోండి. మీరంతా నెలకు తలా మూడొందలు ఆమెకు చెల్లించండి." గిరి హుకుం జారీ చేశాడు.

"అలాగే బాబూ! నా బిడ్డకు కూడ చెప్ప - కనీసం ఆరు నెలలకోసారొచ్చి నన్ను చూసి పొమ్మని." పరిచితమైన గొంతు విని వెనక్కి చూసిన గిరికి తన పిచ్చి తల్లి కనిపించింది.

( గీతాంజలి 1995 కథల పోటీలో 3వ బహుమతి పొందిన కథ)

